## క్లుప్తంగా

### శనేశ్వరుడికి తైలాభిషేకం

పెద్దతిప్పసముద్రం : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శివాలయంలో పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహాలకు అభిషేకాలు, శనేశ్వరునికి తైలాభిషేకం, హనుమంతునికి అభిషేకం, ఆకు పూజ, వడమాల తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

### డిసెంబరు 3న అగ్రిటెక్-2023

కలికిరి : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు అగ్రిటెక్-2023 ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. సదస్సులో యూనివర్సిటీ ఆవిష్కరించిన నూతన సాంకేతికత ప్రదర్శన, నూతన వంగడాలు, ప్రకృతి వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణ, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల సాగు వివరాలతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల ప్రదర్శలుఎ, డ్రోన్‌ల ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు అగ్రిటెక్ సదస్సుకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఘనంగా అయ్యప్ప అంబళం పూజ


పుష్పాలంకరణలో అయ్యప్ప స్వామి

రామసముద్రం : మండలంలోని తిరుమలరెడ్డిపల్లెలో శనివారం రాత్రి అయ్యప్ప అంబళం పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పలురకాల పుష్పాలతో అలంకరణ చేసి, అరటి కొమ్మలతో 18 మెట్లుగా అలంకరణ చేశారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ చేశారు. గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల్లో మాల దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాముల భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో వచ్చిన భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు.

### ఆర్టీఐ కమిటీ నియోజక వర్గ ఇన్‌చార్జిగా హరినాథరెడ్డి



కురబలకోట : ప్రజా సంకల్ప వేదిక ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) తంబళ్లపల్లె నియోజక వర్గ ఇన్‌చార్జిగా కురబలకోట మండలానికి చెందిన గొని హరినాథరెడ్డిని నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మదిరె రంగసాయి రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కేవీపల్లి : మండల పరిధిలోని వగళ్ళ గ్రామం బుర్రావాండ్లపల్లికి చెందిన బి.లక్ష్మీదేవి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందింది. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మృతురాలు కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని స్థానిక సర్పంచ్ రామకొండారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జయరామచంద్రయ్య చేతుల మీదుగా అందచేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బీమా నగదు త్వరితగతిన బాధిత కుటుంబానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### 500 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం


నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వాల్మీకిపురం : గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా తయారీ చేస్తున్న 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు మండలంలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో గండబోయనపల్లి పంచాయతీ మేకలవారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నాకా బంది నిర్వహించి, అక్రమంగా తయారీ చేస్తున్న నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

### నైపున్యాభివృద్ధి విద్యను అందించాలి

కలకడ : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నైపున్యాభివృద్ధి విద్యను అందించాలని ఎంఈఓ మునీంద్రనాయక్, కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయులు అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జరిగిన కలకడ, కలికిరి, సంబేపల్లె మండలాలలోని 7,8,9 తరగతుల ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

## వచ్చే ఎన్నికలకు
# పార్టీ బలగాలు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఓటర్ల చేర్పులు మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నిర్లక్ష్య ధోరణి వద్దు
- వచ్చే ఎన్నికల్లో జగన్ సీఎం కావడం తథ్యం
- చంద్రబాబు ఎన్ని హామీలు గుప్పించినా ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లి : వచ్చే ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ బలగాలు సిద్ధం కావాలి. ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కేవీపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా జగన్ సారధ్యంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద శాతం ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల వద్దకు వెళితే గతంలో టీడీపీకి ఓట్లు వేసినవారు సైతం జగన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని చెబుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విభేదాలు పక్కన పెట్టి ప్రతి ఓటర్లు కలవాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూతులో మెజారిటీ శాతం పెంచడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఓటర్ల జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చేర్పులు, మార్పులు చేసుకోవడానికి డిశెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ఆలోపు పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కో పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నుంచి కనీసం పది కొత్త ఓటర్లు నమోదు చేపించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైందని తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వంపై బురదజల్లే వ్యాఖ్యలు ఎవరూ నమ్మబోరని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలనే ఉద్దేశంలో ఇష్టాను ఆయన ఇస్తున్న హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి, నాయకులు వెంకటసిద్దులు, దినేష్‌రెడ్డి, రామకొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, యర్రమరెడ్డి, మోహన్ రెడ్డి, సైపుల్లాఖాన్, హరిబాబు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


కొత్తపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని సీటీఎం-2 పంచాయతీ రేగంటివారిపల్లె సచివాలయ పరిధిలోని కొత్తపేట, మిట్టపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సర్పంచ్ బండపల్లిఈశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీటీఎం-2 పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండపల్లి వెంకటరమణ, అక్కులప్ప తదితరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి పంచాయతీలో లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్‌సెంటర్లు, సీసీరోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చలేక చంద్రబాబు పార్టీ వెబ్‌సైట్‌లో నుంచి తొలగిస్తే.... మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి, ఇచ్చిన ప్రతిహామీని 100 శాతం నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్న నాయకుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జగనన్న ప్రజలకు చెప్పిన హామీలనే కాకుండా చెప్పనివాటిని నెరవేర్చి ప్రతి గడపలో సంతోషాన్ని నింపారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందిన పథకాలు, జరిగిన అభివృద్ధి, జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమం, సమకూరిన సౌకర్యాలపై బేరీజు వేసుకోవాలన్నారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ దీవించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, ఎంపీటీసీలు భారతి, అనసూయ, మురళీ, ఆదినారాయణ, ఖాదర్, మహబూబ్‌బాషా, జాకీర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్


మాట్లాడుతున్న ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, తదితరులు

వాల్మీకిపురం : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల ద్రోహి అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం కార్యదర్శి బబ్లూ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో నాలుగున్నర ఏళ్లు పాటు మైనార్టీ మంత్రి లేకుండా మైనార్టీ సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. అంతేకాకుండా గతంలో టిడిపి నిర్వహించిన నారా హమారా సభలో మైనార్టీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని అడిగిన పాపానికి ముస్లిం మైనార్టీలపై రాజ ద్రోహం కేసులు పెట్టి తీవ్రవాదుల వలే వేధింపులకు గురి చేశారన్నారు. మైనార్టీ నేత ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు చంద్రబాబు దగా చేస్తే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిలు వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించి, ఆయనకు కేబినెట్ మంత్రిస్థాయి రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించారన్నారు.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి

మదనపల్లె : మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా చేస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ..మున్సిపల్ కమిషనర్‌కు టీపీఎస్ జగదీశ్వర్‌రెడ్డి ద్వారా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ..సామాన్యులు అనుమతి లేకుండా చిన్నపాటి ఇల్లు కట్టుకుంటున్నాడని తెలిస్తే, రెక్కలు కట్టుకు వాలిపోయి, నానాయాగీ చేసి తొలగించేవరకు వదలిపెట్టని సచివాలయ, మున్సిపల్ సిబ్బంది కళ్లెదుటే పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తున్నా పట్టించుకోకపోవడమేంటని ప్రశ్నించారు. చౌడేశ్వరి కల్యాణమండపం పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న ఓ యజమాని ఏమాత్రం భయం, బెరకు లేకుండా మున్సిపల్ అధికారులే నిర్మించుకోమన్నారని చెపుతున్నాడంటే.. అవినీతి ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమనిర్మాణాలపై దృష్టిసారించి తొలగించాలన్నారు.

### నేడు జ్వాలాతోరణం

మదనపల్లె సిటీ : కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలని కోరారు. అలాగే సోమవారం రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

రామసముద్రం : మండలంలో ఆదివారం నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి , డీటీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నుంచి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను ఒక వేదిక పైకి తీసుకువచ్చి మాట్లాడించి వీడియో రికార్డు చేసి ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 17 రకాల స్కిమ్స్‌కు సంబంధించి మండల స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్ నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కురబలకోట : రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ కోరారు. శనివారం మండలంలోని అంగళ్లు, కనసానివారిపల్లెలో ఆగ్రామ సర్పంచులు పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే కష్టారెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులందరూ లబ్ధిపొందేలా చూడటమే వికసిత్ బారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ దిలిప్‌కుమార్, డాక్టర్లు శ్రీధర్, క్రిస్టల్,వైస్ ఎంపీపీ భూదేవి, ఏఓ రాధ, పకల్లా ఖాన్, చంద్రకళ, మొలక గోపాల్ రెడ్డి, త్రివేణి, నీరజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మదనపల్లె సిటీ : పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక బాలికల జూనియర్ కాలేజీలో ఆరోగ్య సమస్యలు, పరిశుభ్రత, వ్యాధుల పట్ల అవగాహన,నివారణ చర్యలు గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా కుష్టు నివారణ అధికారి వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, జాగ్రత్తలు, వ్యాధిని గుర్తించడం, వైద్యసదుపాయాల లభ్యత గురించి తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాలు పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి,సతీష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు హెచ్‌బి పరీక్షలు నిర్వహించారు.

# ప్రజలు ధార్మిక భావన అలవర్చుకోవాలి


భక్తులతో మాట్లాడుతున్న కమలానంద భారతి స్వామి

గుర్రంకొండ : ప్రజలు ఆధ్యాత్మికతతో కూడిన ధార్మిక భావన అలవర్చుకోవాలని విజయవాడ శ్రీభువనేశ్వరీ పీఠం పీఠాధిపతి శ్రీశ్రీ కమలానంద భారతి స్వామి అన్నారు. శనివారం మండలంలోని తరిగొండ, అమిలేపల్లె, గుర్రంకొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకొన్నారు. ఆలయంలో అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్కడే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అక్కడి నుంచి ఎగువ అమిలేపల్లెలోని శ్రీ అభయాంజినేయస్వామి ఆలయంలో జరుగుతున్న అఖండ హనుమాన్ చాలీసా సప్తాహన యజ్ఞంలో పాల్గొన్నారు. తదనంతరం గుర్రంకొండలో మహేంద్రమర్రి ఆశ్రమంలో నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం భక్తులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక, ధార్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా జీవితం సన్మార్గంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణస్వామి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శులు చింతిర్ల కిషోర్, జీవన్ కుమార్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజులు, రిటైర్డ్ వీఆర్వోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, రెడ్డెన్న, మహేంద్రమర్రి ఆశ్రమ గురుస్వాములు మల్లికార్జునస్వామి, మాలాధారణ గురువు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్జి గాయిత్రి

పీలేరు రూరల్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జూనియర్ సివిల్‌జడ్జ్ ఎన్. గాయిత్రి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం అనేది దేశంలో మౌలిక చట్టమని, ఆ చట్టానికి అనుగుణంగానే అన్ని వ్యవస్థలు పనిచేయాలని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి, అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు దక్కిందని అన్నారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ ప్రతిభను, న్యాయనైపుణ్యాన్ని విద్యార్థులకు వివరించారు. న్యాయవిద్య, ఆవశ్యకత, న్యాయ విద్య కోర్సులపట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు కిషోర్ కుమార్‌రెడ్డి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

గుర్రంకొండ : జిల్లాలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని ఆర్బీకేలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు సంబంధించి తప్పనిసరిగా పంటల నమోదు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఆర్బీకేల్లో రైతుభరోసా సిబ్బంది ఈ సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2023 సోషియల్ ఆడిట్ జాబితాను ఆర్బీకేలో ప్రదర్శించామన్నారు. అనుమానం ఉన్న రైతులు ఆర్బీకేలకు వచ్చి పరిశీలించుకోవచ్చన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులతో పాటు పురుగు మందులను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు ఆయా ఆర్బీకేల పరిధిలో తమకు ఎలాంటి ఎరువులు, పురుగు మందులు కావాలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనందున ఈ సీజన్‌లో కూడా రైతులు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈక్రాప్ నమోదు సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో పంట రుణాలు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రత్నమ్మ, ఎంపీఈవో నవాజ్, రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా శనేశ్వరస్వామికి తైలాభి షేకం


విశేష అలంకరణలో శనేశ్వర స్వామి

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలోని శ్రీ అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శనివారం శనేశ్వరస్వామికి మహా తైలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి విశేష పూజలు, పసుపు, కుంకుమ, చందనం, విభూది, జలం, మహా తైలాభిషేకం నిర్వహించారు. 12 అడుగుల శనేశ్వర స్వామికి వెండి కిరీటం, కర్ణపత్ర, పాద కవచాలు, ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ శనేశ్వర స్వామి, ఆంజనేయస్వామికి తైలాభిషకం చాలా ప్రీతికరమన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మురళీ మోహన్, పద్మ, వసంతమ్మ, శశికళ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

కలకడ : జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలోని సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో బాలయ్యగారిపల్లె పంచాయతీకి అందిన ప్రయోజనాలు, లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, ఆర్‌వి, సిద్దయ్య, అంజన్‌కుమార్, షావత్‌అల్లీఖాన్, సుల్తానీబాష, జిలానీ,ఎంపీటీసీసభ్యులు ముభారక్ ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, యుఓ పీఆర్‌డి లతీఫ్‌ఖాన్, సచివాలయసిబ్బంది, వాలంటీర్‌లు పాల్గొన్నారు.

### నిష్పక్షపాతంగా పథకాల అమలు

పెద్దతిప్పసముద్రం : దేశ చరిత్రలో సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే సాధ్యమైందని జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ, ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న అన్నారు. శనివారం మండలంలోని కమ్మచెరువులో సర్పంచ్ చెరువు నరసమ్మ, ఎంపీటీసీ చేలూరు కాంతమ్మ, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్న జగనన్నను ప్రజలంతా మళ్ళీ ఆశీర్వదించాలని స్థానిక నాయకులు వెంకటసుబ్బారెడ్డి, గొర్ల శ్రీనివాసులు రెడ్డి, బాబురెడ్డి, కుంచే శ్రీనివాసులు కోరారు.

### పేదల సంక్షేమమే సీఎం ఆశయం

పీలేరు : పేదల ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని జివి రాకేష్‌రెడ్డి, ఎంపీపీ కంభంసతీష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని పాతబస్టాండ్, శివాలయం వీధి, తదితర వీధులలో ఇంటింటికి తిరిగి ప్రజలకు ప్రభుత్వంనుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. వీధులలో ప్రధానంగా నెలకొన్న సమస్యలు ఉన్నా తెలియజేస్తే పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ పివి మిథున్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లా కోఆప్షన్ సభ్యులు షఫీ, దండు జగన్‌మోహన్‌రెడ్డి, హుమయూన్, చలపతి, సహదేవరెడ్డి, నాగరాజ, క్రిష్టారెడ్డి,మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ


కలకడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వెలుగు సిబ్బంది


మదనపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

మదనపల్లె : నిత్యం ఇంట్లో, బయట స్త్రీలపై జరుగుతున్న హింసలు ఎదుర్కోవాలంటే మహిళలు మరింత శక్తివంతంగా మారాలన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా మహిళాసంఘ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలను, స్త్రీలపై జరిగే హింసను అరికట్టాలని, బాలికా విద్యను ప్రోత్సహించాలని నినాదాలు చేశారు. చిన్నతనంలోనే ఆత్మరక్షణ విద్య నేర్చుకుంటే అసహ్యకరమైన పరిస్థితుల నుంచి తనను తాను రక్షించుకోవడంతో పాటు కష్టాల్లో ఉన్న ఇతరులను రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్ రెడ్డి, సీసీలు శిరీష, భారతి, శ్రీదేవి, సుధా, ఎంఎస్ లీడర్ సీఆర్‌పీ గంగావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సభ్యులు శనివారం మండల కేంద్రంలో జెండార్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. సీసీలు హంసీరాబేగం, తులసీ మాట్లాడుతూ ఈ జాతీయ కార్యక్రమం నవంబర్ 25వ తేదీ నుంచి డిసెంబర్ 22వ తేదీ వరకు అవగాహన ర్యాలీలు జరుగుతాయన్నారు. మహిళలపై వివక్షత చూపి హింసకు గురిచేయడం తగదని సూచనలు ఇచ్చారు. అదేవిధంగా బాల్య వివాహాలు నేరమని, అరికట్టేందుకు అందరూ సహకరించాలన్నారు. వీవోఏలు భారతి, చాన్‌బాషా పాల్గొన్నారు.

కలకడ : జెండార్ ఆధారిత హింసకు స్వస్తి పలకాలి. బాలురు-బాలికలు సమానమనే భావన అందిరిలో రావాలని వెలుగు ఏపీఎం రమేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతమ్మ అన్నారు. శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గ్రామీణ పేదిక నిర్మూలన సంస్థ నిర్వహించిన జాతీయ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. సీసీలు బివి మంజుల, శివశంకర్‌రెడ్డి, నారాయణమూర్తి, సంఘ మిత్రలు రెడ్డెప్ప, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : లింగ వివక్షకు స్వస్తి పలకాలని ఏపీఎం అంగన్‌వాడీ సిబ్బందిఅన్నారు. శనివారం పీలేరులో జెండర్ బేస్డ్ వైలెన్స్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు, లింగవివక్ష, ఇతర సామాజిక సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కలికిరి : పట్టణంలో జెండర్ బేస్డ్ వైలెన్స్‌పై శనివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు సీసీలు ఏకాంబరయ్య, ఆంజినేయులు, బాబాసాట్, ప్రభాకర, చంద్రకళ, సంఘమిత్రలు, ఎస్‌హెచ్‌జీల మహిళలు పాల్గొన్నారు.

### జెండర్ ఆధారిత వివక్షను పోగొట్టాలి

నిమ్మనపల్లె : పనిచేసే చోట్ల, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో లింగ ఆధారంగా వివక్ష కనపరచడం, ఆధిక్యత ప్రదర్శించడం మానుకోవాలని ఏపీఎం రజని అన్నారు. శనివారం జెండర్ ఆధారిత హింసపై జాతీయస్థాయి కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు.